# ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

## సమగ్ర బడ్జెట్ విడుదల ఉత్తర్వులు
## (Comprehensive Budget Release Orders)

గ్రాంట్–ఇన్–ఎయిడ్ సంస్థలకు, వివిధ ప్రభుత్వ విభాగాలకు సకాలంలో నిధులు విడుదల అయ్యేలా బడ్జెట్ కేటాయింపు విధానాన్ని సరళతరం చేస్తూ ప్రస్తుతం అమలులో ఉన్న “Budget Release Order (BRO)” విధానం స్థానే, ఆర్థిక సంవత్సరంలో 4 క్వార్టర్లకు ఒకేసారి బడ్జెట్ విడుదల చేసేందుకు ప్రభుత్వం జిఓ ఎంఎస్ నం.101, ఆర్థిక; తేది.12.08.2015 ద్వారా “సమగ్ర బడ్జెట్ విడుదల ఉత్తర్వులు” (CBRO - Comprehensive Budget Release Orders) జారీ చేసింది.

2001కు ముందు ఆయా ప్రభుత్వ కార్యనిర్వాహక విభాగాలు వారివారి ఆర్థికపరమైన కార్యక్రమాలకు నిధుల విడుదల కొరకు ఆర్థికశాఖను సంప్రదించవలసి వచ్చేది. ఒకసారి నిధులు విడుదల చేసిన తర్వాత వాటి వినియోగంపై రివ్యూ జరిగిన తర్వాతే తదుపరి కార్యక్రమాలకు నిధులు విడుదల చేసేవారు. దీనివల్ల నిధుల కేటాయింపులలో జాప్యం ఎక్కువగా ఉండడంతో శీఘ్రగతిన నిధులు విడుదల చేసేందుకు జిఓ ఎంఎస్ నం.59, ఫైనాన్స్, తేది.30.03.2001 ద్వారా ప్రస్తుత “బడ్జెట్ విడుదల ఉత్తర్వులు (బిఆర్ఓ)” విధానాన్ని ప్రవేశపెట్టారు.

**ప్రస్తుతం అమలవుతున్న బిఆర్ఓ విధానం :**

ఈ విధానంలో 1 సంవత్సరం నుండి అయ్యే బడ్జెట్‌ను ప్రతీ 3 నెలలకొకసారి చొప్పున 4 క్వార్టర్లలో విడుదల చేస్తారు. అయితే ప్రతీ క్వార్టరుకు 6 అంచెలలో నిధులు విడుదల అవుతాయి.

1. స్కీము యొక్క హెడ్ అక్కౌంట్ (హెచ్ఓఏ) వారీగా ప్రతీ క్వార్టరుకు ఆర్థిక కార్యదర్శి బడ్జెట్ విడుదల ఉత్తర్వులు (బిఆర్ఓ) జారీ చేస్తారు.
2. ఆర్థిక విభాగం జారీచేసిన బిఆర్ఓ ననుసరించి, ఆయా కార్యనిర్వాహక విభాగ కార్యదర్శులు అడ్మినిస్ట్రేషన్ సాంక్షన్ (ఏఎస్) జారీ చేస్తారు.
3. వీటి ఆధారంగా శాఖాధిపతులు (హెచ్ఓడి) తమ క్రింది జిల్లాస్థాయి అధికారు(సిఎస్ఓ)ల ప్రభుత్వ విభాగ నియంత్రణాధికారుల (సిసిఓ)కు తగిన సూచనలు, మార్గదర్శకాలతో జిల్లాలు / సంస్థలవారీగా బడ్జెట్ పంపిణీ చేస్తారు.
4. ఈ వివరాలను ఆథరైజేషన్ జారీచేసే నిమిత్తం డిటిఏ/డిడబ్ల్యుఏలకు తగు ఉత్తర్వులు ఇస్తారు.
5. జిల్లాస్థాయి అధికారులు (ఎస్‌సిఓ) డిడిఓల వారీగా బడ్జెట్ పంపిణీ చేసి జిల్లా ఖజానా అధికారులకు తెలియజేస్తారు.
6. వాటి ఆధారంగా డిడిఓలు సమర్పించిన బిల్లులను ఖజానా అధికారులు ఆథరైజ్ చేసి చెల్లింపులు చేస్తారు.

గత విధానంకంటే ప్రస్తుత బిఆర్ఓ విధానం నిధుల విడుదలను సులభతరం చేసినప్పటికి కేటాయించిన నిధులు క్రిందిస్థాయి వరకు చేరాలంటే 6 అంచెలు దాటవలసి వస్తున్నది. అంతేగాక, బడ్జెట్‌ను ప్రతీ 3 నెలలకొకసారి విడుదల చేస్తున్నందున నిధులు సకాలంలో విడుదలకావాల్సింది. దీనిలో కొంత జాప్యం జరుగుతున్నది. ఈ విధానాన్ని మరింత సరళతరం చేస్తూ 6 అంచెల బిఆర్ఓ విధానం స్థానే 3 అంచెల సిబిఆర్ఓ విధానం అమలులోకి రానున్నది.

**సిబిఆర్‌ఓ విధానం ముఖ్యాంశాలు :**

బడ్జెట్ మేనేజిమెంట్ సిస్టమ్‌ను క్రమబద్ధీకరించేందుకు, కార్యక్రమాలను నిర్వహించే సంస్థలకు నిధులు సకాలంలో లభ్యం అయ్యేలా సంవత్సరంలో 4 క్వార్టర్లకు బడ్జెట్ ఒకేసారి విడుదల అయ్యేలా ఈ సమగ్ర బడ్జెట్ విడుదల ఉత్తర్వులు రూపొందించబడ్డాయి. అన్ని సెక్రటేరియట్ విభాగాలు, హెచ్‌ఓడిలు ఈ క్రింది సూచనలు పాటించవలసి వుంటుంది.

1. ప్రతీ కార్యనిర్వాహక విభాగం తన స్కీములు, కార్యక్రమాలు రివ్యూ చేసుకొని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాలతోబాటు, రాబోయే ఆర్థిక సంవత్సరానికి అయ్యే ఖర్చును అంచనావేసి సెప్టెంబర్ ఆఖరు వారంలోగా తమ ప్రతిపాదనలు సమర్పించాలని. వాటి ఆధారంగా వనరుల లభ్యతను బట్టి ఈ ఆర్థిక సంవత్సరంలో అయ్యే మొత్తాన్ని నవంబర్‌లోను, వచ్చే సంవత్సరం బడ్జెట్‌ను డిసెంబర్ నెలల్లోను ఆర్థికశాఖ ఖరారు చేస్తుంది.
2. వార్షిక బడ్జెట్ ఆమోదం పొందిన 15 రోజులలోగా కార్యనిర్వహక విభాగ కార్యదర్శులు వారి క్రింది విభాగాలకు ఒక్కొక్క క్వార్టరుకు ఎంతమొత్తం అవసరమౌతుందనేదాన్ని నిర్ణయిస్తారు. ఆ ప్రతిపాదనల ఆధారంగా 4 క్వార్టర్లకు అవసరమయ్యే మొత్తాన్ని సిబిఆర్‌ఓ ద్వారా ఆర్థిక శాఖ జారీ చేస్తుంది.
3. 3 అచెంలలోనే క్రిందిస్థాయి వరకు నిధులు చేరేలా ఈ విధానం రూపొందించారు.
   i) సంవత్సరంలో అన్ని క్వార్టర్లకు ఒకేసారి బడ్జెట్ సిబిఆర్‌ఓ ద్వారా విడుదల చేస్తారు.
   ii) హెచ్‌ఓడిలు జిల్లాస్థాయి అధికారులు, డిడిఓలకు బడ్జెట్ పంపిణీ చేసి ఉత్తర్వులు ఇస్తారు.
   iii) బిల్లులు సకాలంలో చెల్లించేందుకు డిటిఏ, డిడబ్ల్యుఏలకు బడ్జెట్ ఆథరైజేషన్ ఉత్తర్వులు ఇస్తారు.
4. ప్రతీ క్వార్టరుకు కార్యనిర్వాహక విభాగం అడ్మినిస్ట్రేటివ్ ఉత్తర్వులు ఇవ్వనవసరం లేదు. సూచనలు, మార్గదర్శకాలు ఎప్పటికప్పుడు జారీచేస్తారు. (నిర్థిష్టమైన ప్రాజెక్టులు, పనులు, స్కీములు, కార్యక్రమాలు మొ॥ వాటికి ఈ ఉత్తర్వులు వర్తించవు.)
5. ఆమోదించబడిన పని ప్రణాళిక ఆధారంగా హెచ్‌ఓడిలు తమ క్రింది జిల్లాస్థాయి అధికారులకు, డిడిఓలకు, తమ కార్యాలయపు సిసిఓలకు అన్ని క్వార్టర్లకు బడ్జెట్ పంపిణీ ఉత్తర్వులు జారీచేస్తారు. అన్ని స్కీములు, కార్యక్రమాలు సకాలంలో ప్రారంభించేందుకు 20% మించకుండా నిధులు హెచ్‌ఓడి తమ వద్ద వుంచుకొని కేటాయించవచ్చు.
6. హెచ్‌ఓడిలు జారీచేసిన సిబిడిఓ (Comprehensive Budget Release Orders) ఆధారంగా డిటిఏ / డిడబ్ల్యుఏలు ఒక క్వార్టరుకు బడ్జెట్ ఆథరైజేషన్ అర్డర్స్ (బిఏఓ) జారీ చేస్తారు. దానిలో ఆ క్వార్టరులో సిసిఓ / ఎస్‌సిఓ / డిడిఓలు ఎంత మొత్తం డ్రా చేయవచ్చునని స్పష్టంగా చెప్పబడుతుంది. ప్రతీ క్వార్టరు మొదటి వారంలో ఈ బిఏఓలు జారీచేస్తారు.
7. రాజభవన్, హైకోర్టు, అసెంబ్లీ ఉద్యోగులకు ఈ విధానం వర్తించదు. వారికి ప్రస్తుత బిఆర్‌ఓ విధానంలోనే చెల్లింపులు జరుగుతాయి. సెక్రటేరియట్ విభాగాల ఖర్చులకు ట్రెజరీ ఆమోదం అవసరం లేదు. అలాగే కాపిటలా హెచ్‌ఓఏలకు కూడా ప్రస్తుతం బిఆర్‌ఓ విధానమే కొనసాగుతుంది.

ప్రభుత్వం జారీచేసిన ఈ సమగ్ర బడ్జెట్ విడుదల ఉత్తర్వులు సిబిఆర్‌ఓ విధానం వలన ఎయిడెడ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు, గ్రాంట్-ఇన్-ఎయిడ్ ద్వారా జీతాలు పొందే వారికి అవసరమైన బడ్జెట్ ఒకేసారి విడుదల కానుంది. దీనివల్ల ప్రతి 3 నెలలకొకసారి బడ్జెట్ విడుదల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉద్యోగులకు తప్పుతుంది. అంతేకాదు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వలెనే ప్రతీనెలా మొదటి తారీఖున ఉద్యోగులు జీతాలు పొందే పరిస్థితి ఏర్పడుతుంది. గత కొన్ని నెలలుగా ఆర్థికశాఖామంత్రి మరియు ఆర్థిక శాఖ అధికారులతో పలు దఫాలు ప్రాతినిధ్యాలు చేసిన ఫలితంగా ఉత్తర్వులు వెలువడినాయి. ఈ ఉత్తర్వులు పట్ల యుటియఫ్ హర్షం వ్యక్తం చేస్తూ ఎట్టి ఆటంకాలు లేకుండా అమలయ్యేందుకు తగిన కృషి చేస్తుంది.

**ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్**

**విజయవాడ**